**ప్రజల మాట ప్రగతి బాట**

# రామగుండం నియోజకవర్గం

## ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆపరేటర్లతో మాట్లాడుతున్న శ్రీనివాస్

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 12 : సింగరేణి సంస్థ ఆర్జీ2 ఏరియాలోని ఓసీపీ3లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఓసీపీ3 ప్రాజెక్టులో ఈపీ ఆపరేటర్లను కలువగా పలు సమస్యలు దృష్టికి తీసుకొనివచ్చారు. పార్కింగు యార్డులో నీటి సదుపాయం లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయన వెంట ఫిట్ కార్యదర్శి కొంగర రవీందర్, కస్తూరి గణేశ్, గజ్జి ఓదెలు, ఎల్కలపల్లి సదయ్యా, కల్లూరి రాజయ్యా, కూర తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, సతీశ్, సదానందం, ఆకుల రాజిరెడ్డి, మామిడాల తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## రెస్క్యూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి



రెస్క్యూ సిబ్బందితో మాట్లాడుతున్న మిర్యాల

యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 12 : సింగరేణి సంస్థ రెస్క్యూలో పనిచేసే సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం డివిజన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌తో కలిసి రెస్క్యూ స్టేషన్‌లో సిబ్బందిని కలుసుకుని, జోనల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. రెస్క్యూలో పనిచేస్తున్న వారికి అవసరమైన అలవెన్సులు, ప్రతిభ కనబరిచిన వారికి ఆర్థిక ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు. ప్రతి డివిజన్‌లో రెస్క్యూ సిబ్బందికి ప్రత్యేకమైన క్వార్టర్ కేటాయించాలని యాజమాన్యాన్ని కోరారు.

## ‘చందర్’ను గెలిపించుకొందాం



సమావేశంలో పాల్గొన్న 49వ డివిజన్ బీఆర్ఎస్ శ్రేణులు

గోదావరిఖని టౌన్, అక్టోబర్ 12 : రామగుండం నియెజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొందామని 49వ డివిజన్ అధ్యక్షులు నూతి తిరుపతి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మార్కండేయ కాలనీలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశానికి తిరుపతి హాజరై బూత్ కన్వీనర్, కో కన్వీనర్లు, ఇన్‌చార్జిలతో మాట్లాడారు. జరుగబోయే ఎన్నికలలో కోరుకంటి చందర్ ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి కాంపెల్లి సతీశ్, నాయకులు సతీశ్ బాబు, జాహిద్ బేగ్, పద్మ, మంజుల, శ్రీనివాస్, జహంగీర్, యాకూబ్, గణేశ్, అంకూస్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

కోల్‌సిటీ, అక్టోబర్ 12: కోర్టు విచారణలో ఉన్న ఓ వివాదాస్పద స్థలంలో అక్రమంగా నిర్మించిన గోడను గురువారం రామగుండం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కూల్చివేశారు. రామగుండం కార్పొరేషన్ 26వ డివిజన్ మార్కండేయ కాలనీ శివాలయం సమీపంలో ఖాళీ స్థలం వివాదంపై హైకోర్టు విచారణలో ఉండగానే కొందరు వ్యక్తులు అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని నగర పాలక సంస్థ కమిషనర్ దృష్టికి రావడంతో ఆయన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ఆదేశాలతో పట్టణ ప్రణాళికా విభాగం అధికారి తిరుపతమ్మ, సిబ్బందితో కలిసి వెళ్లి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు.

## ప్రజా అంకిత యాత్రకు బ్రహ్మరథం

- ఎమ్మెల్యే కోరుకంటికి యువతీయువకుల ఘన స్వాగతం
- మంగళ హారతులతో మహిళల ఆశీర్వాదం



గోదావరిఖని: 42వ డివిజన్‌లో ప్రజల వద్దకు వెళ్లి పలకరిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, అక్టోబర్ 12: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన ప్రజా అంకిత యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఏ డివిజన్‌కు వెళ్లినా మహిళలు మంగళ హారతులతో ఆశీర్వదిస్తున్నారు. యువతీయువకులు తమకు మేలు చేసిన చందర్‌కు జైకొడుతున్నారు. అవ్వా తాతలు నెలనెలా పింఛన్ వస్తున్నదని సంబురంగా చెబుతున్నారు. కల్యాణ లక్ష్మి పథకంతో బిడ్డ పెండ్లికి చేసిన అప్పుతీరిందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు. మిషన్ భగీరథతో తాగునీటి గోస తీరిందని, రోడ్ల అభివృద్ధితో రవాణా మెరుగైందని, మెడికల్ కళాశాలతో వైద్యం చేరువైందని, ఖుర్జా కమ్మి భూములకు పట్టలింపించిన ఘనత కోరుకంటికే దక్కిందని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. కారు గుర్తుకు ఓటేసి గులాబీ పార్టీని గెలిపిస్తామని ప్రతిన బూనుతున్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

కోల్‌సిటీ, అక్టోబర్ 12 : రామగుండం నగర పాలక సంస్థ 13వ డివిజన్ కార్పొరేటర్ రాకం లత దామోదర్ ఆధ్వర్యంలో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన పలువురు ఆటోడ్రైవర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం డివిజన్‌కు చెందిన విఠల్‌నగర్ క్లబ్ ఏరియా ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు దండె మహేందర్, డ్రైవర్లు గరిగ రవి, ఇంజపురి రాజన్న, బొడ్డు మల్లయ్యా, తాని తిరుపతి బీఆర్ఎస్‌లో చేరగా, కోరుకంటి చందర్ హాజరై పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిని ఎమ్మెల్యే అభినందించి దండె మహేందర్‌కు 13వ డివిజన్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మారుతి, గాజుల రమేశ్ తదితరులున్నారు.



కోల్ సిటీ : బీఆర్ఎస్‌లో చేరుతున్న విఠల్ నగర్‌లో ఆటో యూనియన్ నాయకులు

## వేగంగా నంది రిజర్వాయర్ లింక్ కాల్వ నిర్మాణం

ధర్మారం,అక్టోబర్12: మండలంలోని మల్లాపూర్ నుంచి ఎస్సారెస్పీ డీ–83 కాల్వకు అనుసంధానించేందుకు నంది రిజర్వాయర్ నుంచి నిర్మిస్తున్న కాల్వ నిర్మాణం చకచకా సాగుతున్నది. రూ. 12.14 కోట్లతో పనులు చేపట్టారు. ఈ వానకాలం నీరందించే లక్ష్యంతో వేగంగా పనులు చేపట్టారు. రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తనిఖీ చేసి అధికారులు, కాంట్రాక్టర్‌కు దిశానిర్దేశం చేశారు. కాగా నంది రిజర్వాయర్ నుంచి పైపుల మీదుగా ఈ లింక్ కాల్వ పాత ఎస్సారెస్పీ కాల్వ డీ–83 కాల్వ 10.220 కిలో మీటర్ వద్ద లింక్ చేయనున్నారు. ఈ క్రమంలో డీ–83 కాల్వ, ఇది వరకు ఉన్న 8 1/2 మీటర్ల కాల్వను 16 మీటర్లకు విస్తరిస్తున్నారు. కాగా, ఈ పనుల కారణంగా ఎస్సారెస్పీ డీ 83 క్రాల్వకు అనుబంధంగా ఉన్న మల్లాపూర్ డిస్ట్రిబ్యూటరి ద్వారా వారం రోజుల నుంచి నీటి సరఫరాను నిలిపి వేశారు. దీంతో ధర్మారం, ఎండపల్లి, వెల్గటూరు మండలాల్లోని పంటలకు నీరందించేందుకు వీలుగా తాత్కాలికంగా పనులు నిలిపి వేసి కాల్వ కట్టను ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం నుంచి డీ–83 కాల్వకు నీటిని తిరిగి సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## బీఆర్ఎస్‌లో చేరికల జోష్

కాల్వశ్రీరాంపూర్: పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్12: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్‌లో చేరికల జోష్ కనిపిస్తున్నది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్, బీజేపీ నాయకులు గులాబీ గూటికి చేరుతున్నారు. తాజాగా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఆశన్నపల్లెకు చెందిన ముస్కు సత్తయ్యా, ఎరుకల ప్రభాకర్, ముస్కు రాజేశ్, కూస సాగర్, నరిగె సుమన్‌కుమార్, కూస నితిన్, మంద అజయ్ గురువారం ఎమ్మెల్యే దాసరి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పెద్దపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దాసరి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. పాత, కొత్తవారు సమన్వయ్యంతో పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. సర్పంచ్ మంద రమ వెంకన్న, ఎంపీటీసీ పెండ్లి సంపత్, గ్రామ అధ్యక్షుడు కూస హరీశ్, ఆర్బీఎస్ కోఆర్డినేటర్ ఎరుకల మల్లయ్యా, నేతలు కూస రవి, కూస శ్రీనివాస్, కదురు రాజ్‌కుమార్ ఉన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్12: కోర్టు పరిధికి సంబంధించిన వివిధ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి ఎం అర్జున్ అన్నారు. పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూర్‌లో గురువారం రాత్రి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీపీ మిట్టపెల్లి వసంత, స్థానిక ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

## బీసీ సెల్ కార్పొరేషన్ ప్రతినిధిగా మల్లేశం

జ్యోతినగర్, అక్టోబర్ 12: రామగుండం కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధిగా ఎన్టీపీసీకి చెందిన వొల్లాల మల్లేశం నియమితులయ్యారు. గురువారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియమకానికి సహకరించిన స్థానిక కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులకు మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ఓదెల, అక్టోబర్ 12: ఓదెల మండలంలో పనిచేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. కొలనూర్ కార్యదర్శి భానుప్రసాద్‌ను బాయమ్మపల్లికి, అక్కడ డిప్యూటేషన్ మీద పనిచేస్తున్న మహేందర్‌ను కొలనూర్‌కు, అలాగే ఓదెల కార్యదర్శి సత్యనారాయణరెడ్డిని కొమిరెకు, అక్కడ పనిచేస్తున్న కిరణ్‌ను ఓదెలకు, మడకలో పనిచేస్తున్న అనితను గూడెంకు, అక్కడ పనిచేస్తున్న దిలీప్‌ను మడకకు బదిలీలు జరిగాయి.

## ఆదనపు కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 12: పెద్దపల్లి ఆదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు గురువారం తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన కారులో హైదరాబాద్ నుంచి పెద్దపల్లికి వస్తుండగా మెదక్ జిల్లా గజ్వేల్ కుకునూర్‌పల్లి వద్ద గ్రామ రాజీవ్‌రహదారిపై వేగంగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో శ్యాంప్రసాద్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

## ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష

గోదావరిఖని, అక్టోబర్ 12: సింగరేణి సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర రెడ్డి అన్ని ఏరియాల జీఎంలతో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఉత్పాదకతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓసీపీలో నిర్దేశించిన ఓబీ, ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టాల్సిన విషయాలపై దిశానిర్దేశం చేశారు. ఆర్జీ1 నుంచి జీఎం చింతల శ్రీనివాస్, ఇంజినీర్ రాంమ్మూర్తి, ఏజెం ట్ బానోతు సైదులు, చిలక ప్రసాద్, పీఓ చంద్రశేఖర్, ఆంజనేయులు, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నియామకం

గోదావరిఖని, అక్టోబర్ 12: రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌ను గురువారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియమించారు. నియోజకవర్గంలో పార్టీ అభ్యున్నతికి గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

## డీటీఎఫ్ సభలను విజయవంతం చేయాలి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్12: ఈనెల15 నుంచి 17 వరకు మహబూబ్‌నగర్‌లో డీటీఎఫ్ ఆధ్వర్యంలో జరుగనున్న 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కాల్వశ్రీరాంపూర్ హైస్కూల్‌లో మహాసభలకు సంభందించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఇక్కడ మండల అధ్యక్ష కార్యదర్శులు మహేందర్, వెంకటరమణ, జోన్ బాధ్యులు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, జ్యోత్స్న ఉన్నారు.

## ప్రపంచ దృష్టి దినోత్సవం

ఓదెల, అక్టోబర్ 12: ఓదెల మండల కేంద్రంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహించారు. కళ్లు లేకపోతే జీవితం ఎంత భయంకరంగా ఉంటుందో అని తెలిసేలా నల్ల రిబ్బన్‌లు కళ్లను కట్టుకుని రోడ్డు దాటే ప్రయత్నం చేశారు. కళ్లులేని వారికి అన్ని విధాలా సహకరించాలని సూచించారు. ఇక్కడ సంస్థ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి, క్యాతం వెంకటేశ్వర్లు, కొండ్రవేణు, క్యాతం మల్లేశం,శాతల్ల కుమార్, తాటికొండ రమేశ్, క్యాతం సదానందం, రాజేంద్రప్రసాద్, సారంగం,చందు,రవి ఉన్నారు.